సాక్షి
రాజన్న సిరిసిల్ల
బుధవారం ׀ 1 ׀ జనవరి ׀ 2025



మాంజా దారం.. మస్తు ప్రమాదం

సంక్రాంతి సెలవుల్లో గాలి పటాలు ఎగరేసేందుకు ఉపయోగించే దారం చిన్నారుల ఉసురు తీస్తోంది. నిషేధిత మాంజాను ఉపయోగించడం వల్ల పిల్లలు ప్రాణాల మీదకి తెచ్చుకుంటున్నారు. 8లో▸



నిషేధిత మాంజా విక్రయిస్తే చర్యలు

చైనా మాంజాపై ప్రభుత్వం నిషేధం విధించినప్పటికీ చట్ట వ్యతిరేకంగా అమ్ముతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత పేర్కొన్నారు. 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
30.0/18.0

వాతావరణం పొడిగా ఉంటుంది. సాయంత్రం ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన విప్



సీఎం రేవంత్‌రెడ్డితో విప్ ఆది, మల్లేశం

వేములవాడ: సీఎం రేవంత్‌రెడ్డిని మంగళవారం విప్ ఆది శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు అంశాలపై చర్చించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట కరీంనగర్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం ఉన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి



మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మంగళవారం సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కను హైదరాబాద్‌లో కలిశారు. సిద్దిపేట–కామారెడ్డి ప్రధాన రహదారి నుంచి కొత్తపల్లి మీదుగా సిద్దిపేట జిల్లా శివాజీనగర్ శివారు వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మేడ భాస్కర్, రాజనర్సింహారెడ్డి, రాజనర్సు, ఎలుక రాజు, అజాం, గోపాల్‌రెడ్డి ఉన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



స్టేషన్‌కు తరలివెళ్తున్న న్యాయవాదులు

సిరిసిల్లకల్చరల్: సహ న్యాయవాదిని పోలీసులు అక్రమంగా నిర్బంధించడాన్ని నిరసిస్తూ జిల్లా న్యాయవాదులు మంగళవారం కోర్టు విధులు బహిష్కరించారు. ముందస్తు నోటీసులు జారీ చేయకుండా విచారణ పేరిట ఓ న్యాయవాదిని అదుపులోకి తీసుకున్న నేపథ్యంలో బార్ అసోసియేషన్ అత్యవసర సమావేశం నిర్వహించి విధుల బహిష్కరణ నిర్ణయం తీసుకున్నారు. కోర్టు ప్రాంగణం నుంచి అంబేడ్కర్ సర్కిల్ మీదుగా పోలీస్ స్టేషన్‌కు పాదయాత్రగా తరలి వెళ్లారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దోర్నాల సంజీవ్‌రెడ్డి, తంగళ్లపల్లి వెంకటి, న్యాయవాదులు పాల్గొన్నారు.


రోడ్డెక్కి.. మాస్కులు ధరించి



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

సిరిసిల్లటౌన్: ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలంటూ ఉద్యోగులు మంగళవారం సిరిసిల్ల–కరీంనగర్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. అంతకుముందు దీక్షా శిబిరంలో ముఖాలకు సీఎం రేవంత్‌రెడ్డి మాస్కులు ధరించి నిరసనలు హోరెత్తించారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా సమాన పనికి సమాన వేతనం అందించాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, అంతవరకు పే స్కేల్ అమలు చేయాలని పేర్కొన్నారు. దీక్ష శిబిరాన్ని జనా విజ్ఞాన వేదిక సభ్యులు మాజీ మండల విద్యాధికారి, మాజీ సెక్టోరియల్ అధికారి వెన్నమనేని రామచంద్రం సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షకు చెందిన అన్ని విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎల్‌ఎండీకి నీటి విడుదల



ఎల్‌ఎండీకి విడుదల అవుతున్న నీరు

బోయినపల్లి: మిడ్‌మానేరు నుంచి మంగళవారం ఎల్‌ఎండీకి 500 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 350 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో నీటిమట్టం 25.73 టీఎంసీలకు చేరగా, 300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



జిల్లా కేంద్రంలోని అభయాంజనేయ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో న్యూ ఇయర్ వేడుకలు

నయా సందడి

సిరిసిల్లటౌన్: పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ జిల్లా కేంద్రంలో మంగళవారం సంబరాలు మిన్నంటాయి. అన్నివర్గాల ప్రజలు హ్యాపీ న్యూ ఇయర్ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని బేకరీలు, మిఠాయి దుకాణాల్లో అమ్మకాలు జోరందుకున్నాయి. మహిళలు రంగులు కొనడానికి ఉత్సాహం చూపారు. గ్రీటింగ్‌కార్డులు, కేకులు అమ్మకాలతో మార్కెట్‌లో పండుగ వాతావరణం సంతరించుకుంది. అర్ధరాత్రి వరకు వేడుకలు కొనసాగాయి. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బార్లు, రెస్టారెంట్లు కిటకిటలాడాయి. వేడుకల నిర్వహణపై పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. అర్ధరాత్రి వరకు వైన్‌షాపులు, బార్ షాపులు తెరిచి ఉంచి అమ్మకాలు జరిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, పలువురు ప్రముఖులు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

కొరవడిన ఆత్మీయ స్పర్శ

- ఆదరణ కోల్పోయిన గ్రీటింగ్ కార్డులు
- న్యూ ఇయర్‌కు గతంలో కార్డులదే హవా
- వాట్సప్.. ఇన్‌స్ట్రాగామ్, ఫేస్‌బుక్‌లకు ఆదరణ
- సోషల్ మీడియాలో శుభాకాంక్షల వెల్లువ



గ్రీటింగ్ కార్డులు

సిరిసిల్లటౌన్: ఉరుకులు పరుగుల జీవనంలో ఆత్మీయ మాటలు మౌనం దాల్చాయి. ఒకరినొకరు పలకరింపులు తగ్గుముఖం పట్టాయి. ప్రత్యేక రోజుల్లో అయిన వారికి నేరుగా శుభాకాంక్షలు చెప్పుకోలేని పరిస్థితిలో బతుకుతున్నాం. న్యూ ఇయర్ వేడుకల్లో ఒకప్పుడు గ్రీటింగ్ కార్డులు, నేరుగా కరచాలనం చేసుకుంటూ శుభాకాంక్షలు చెప్పుకునేవారు. ఇప్పుడా పరిస్థితికి భిన్నంగా మారింది. మార్కెట్లో గ్రీటింగ్ కార్డుల ఉనికే మాయమయ్యే పరిస్థితి దాపురించడం ఆత్మీయ స్పర్శ కొరవడిందనడానికి నిదర్శనం. ఒకప్పుడు న్యూ ఇయర్ వేడుకల్లో హవా నడిచిన గ్రీటింగ్ కార్డులపై ప్రత్యేక కథనం.

పక్షం రోజుల ముందుగా సందడి

కొత్త సంవత్సరం వస్తుందంటే చాలు డిసెంబర్ 15వ తేదీ మొదలు 31 వరకు గ్రీటింగ్ కార్డుల అమ్మకాలు జరిగేవి. చుట్టుపక్కలవారు, స్నేహితులకు కొత్త సంవత్సరం రోజునే నేరుగా కలుసుకుని వారికి నచ్చే రంగులు, డిజైన్లలో తయారు చేసిన గ్రీటింగ్‌కార్డులు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపేవారు. దూర ప్రాంతాల్లో ఉండే ఆత్మీయులకు మాత్రం పక్షం రోజులు ముందుగానే కార్డులు కొని పోస్టు ద్వారా పంపేవారు. ఇక డిసెంబర్ మాసం మొత్తం చిరు వ్యాపారులకు సీజనల్ ఉపాధి దొరికేది. సిరిసిల్ల పట్టణంలోనే రూ.లక్షల విలువైన గ్రీటింగ్ కార్డులు అమ్ముడు పోయేవి. నూతన సంవత్సరానికి నెల రోజుల ముందే పట్టణాల్లో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి హైదరాబాద్, బెంగుళూరు, ఢిల్లీ, కలకత్తా వంటి నగరాల నుంచి గ్రీటింగ్ కార్డులు తెప్పించి విక్రయించే వారు. వాటిగా కొనుగోలు చేసేందుకు ప్రజలు ఉత్సాహం చూపేవారు. గతంలో పదుల సంఖ్యలో గ్రీటింగ్ కార్డులు అమ్మే దుకాణాలు ఉండగా. ఇప్పుడు సిరిసిల్లలో ఒకట్రెండు షాపుల్లో విక్రయిస్తున్నారు. పెరిగిన సాంకేతికత పరిజ్ఞానం మనుషుల మధ్య అగాదాన్ని మిగులుస్తుందనడానికి గ్రీటింగ్ కార్డుల హవా తగ్గడమే నిదర్శనంగా చెప్పవచ్చు.

తీపి జ్ఞాపకాలుగా.. గ్రీటింగ్ కార్డులు

అందమైన అనుభూతుల్ని, విషాదాలను మిగిల్చిన పాత సంవత్సరం వెళ్లిపోయిన నేపథ్యంలో నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికేందుకు ప్రజలు లేటెస్ట్ ట్రెండులో సిద్ధమయ్యారు. ఈమెయిల్స్, సాధారణ ఎస్‌ఎంఎస్‌లు, వాట్సాప్, ఇన్‌స్టాగామ్ మెస్సేజ్‌లతో ఒకరినొకరు శుభాకాంక్షలు చెప్పుకుంటున్నారు. గతంలో ఆత్మీయుల మధ్యనే సాగిన కొత్త సంవత్సర శుభాకాంక్షల పలుకరింపులు ఇప్పుడు సామాజిక మాధ్యమాలతో అన్నివర్గాలకు కనపడకుండా, నేరుగా కలువకుండానే చెప్పుకుంటున్నారు. దీంతో ఒకప్పుడు మార్కెట్‌ను ఊపేసిన గ్రీటింగ్‌కార్డులు చరిత్రలో తీపి జ్ఞాపకాలుగా మిగిలిపోయాయని వాటి ప్రేమికులు చెబుతున్నారు.

సందడి కరువైంది



ఇరవై ఏళ్ల క్రితం క్రిస్మస్, న్యూ ఇయర్ వచ్చిందంటే వేలాదిగా గ్రీటింగ్ కార్డులు అమ్మేటోళ్లం. సెల్‌ఫోన్లలో వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగాం తదితర యాప్‌లతో ప్రజలు వాటిలోనే కొత్త సంవత్సరం శుభాకాంక్షలు చెప్పుకుంటున్నారు. అలనాటి ఆత్మీయతను కోరుకునే వారు, పుట్టినరోజులు, మ్యారేజ్ డేస్ తదితరాలకు మాత్రమే తక్కువ సంఖ్యలో ఇప్పుడు గ్రీటింగ్ కార్డులను కోరుకుంటున్నారు.
– నాగుల రాజశేఖర్, వ్యాపారి

గ్రీటింగ్స్ తయారు చేసి ఇచ్చేటోళ్లం..



మేము చదువుకునే రోజుల్లో నేరుగా కాగితాలు, రంగులతో అందంగా గ్రీటింగ్‌కార్డులు తయారు చేసి మా గురువులు, పెద్దవాళ్లకు ఇచ్చి ఆశీర్వాదం పొందేటోళ్లం. తదుపరి రెడీమేడ్ గ్రీటింగ్‌కార్డులు కూడా చూడముచ్చట గొలిపేవి. కార్డులతో కొత్త సంవత్సరం రోజున ఆత్మీయులు, పెద్దల వద్దకు వెళ్లి శుభాకాంక్షలు చెప్పేటోళ్లం. ఆరోజుల్లో మధురానుభూతులు పంచే అంశాల్లో ఇదొక్కటి. నేటి పిల్లలు అటువంటి ఆత్మీయతలు కోల్పోతున్నారు.
– శారద, బాలికల పాఠశాల హెచ్‌ఎం, సిరిసిల్ల

విద్యుత్ ప్రైవేటీకరణ అడ్డుకుంటాం



మాట్లాడుతున్న రమణ

సిరిసిల్లటౌన్: నరేంద్ర మోదీ ప్రభుత్వం వివిధ రాష్ట్రాల్లో చేపట్టిన విద్యుత్ డిస్కంల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ ఆఫీసులో మాట్లాడారు. విద్యుత్ రంగాన్ని కాపాడుకుందాం, విద్యుత్ కార్మికులు, ఇంజినీర్ల ఐక్య పోరాటానికి అండగా నిలబడదాం, డిసెంబర్ 31 సంఘీభావ దినం పాటిద్దాం అంటూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం కార్యక్రమం నిర్వహించినట్లు వివరించారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక, వినాశకర విధానాలను అవలంబిస్తుందని మండిపడ్డారు. చండీగఢ్, ఉత్తరప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విద్యుత్ రంగాలను ప్రైవేటీకరించే ప్రయత్నాలు మొదలయ్యాయని, ఆయా రాష్ట్రాల్లో స్మార్ట్ మీటర్లు నెలకొల్పడం ద్వారా దొడ్డి దారిన విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. విద్యుత్ రంగ పరిరక్షణకు పోరాడుతున్న కార్మికులు, ఉద్యోగులకు మద్దతుగా ప్రజలందరూ సంఘీభావం ప్రకటించాలని కోరారు. నాయకులు అన్నల్దాస్ గణేశ్, ఎలిగేటి రాజశేఖర్, నక్క దేవదాస్, సిరిమల్ల సత్యం, ఉడుత రవి, సందుపట్ల పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్



వాహనాల తనిఖీలో ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లకల్చరల్: నూతన సంవత్సర వేడుకల్లో అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉందని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. మంగళవారం రాత్రి అంబేడ్కర్ సర్కిల్‌లో డ్రంకెన్ డ్రైవ్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కొత్త సంవత్సరం జిల్లా ప్రజలు సుఖ శాంతులతో విలసిల్లాలని ఆకాంక్షించారు.

అప్రమత్తంగా ఉండాలి

వేములవాడఅర్బన్: ఎస్ఎస్ఎకో మోటార్స్ పేరుతో గొలుసుకట్టు మల్టీ లెవల్ మార్కెటింగ్‌కు పాల్పడుతున్న నిందుతుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్పీ అఖిల్‌మహాజన్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, నాంపల్లికి చెందిన రేగుల బలరాం మాయమాటలు నమ్మి వేములవాడ మండలం శాభాష్‌పల్లి గ్రామానికి చెందిన పండుగ నరేశ్‌కుమార్ ఎస్ఎస్ఎకో మోటార్స్ మేనేజ్‌మెంట్ ప్రవేశపెట్టిన గొలుసుకట్టు పద్ధతి ద్వారా ఎలక్ట్రిక్ బైక్ కొనడానికి రూ.21 వేలు కట్టి స్కీమ్‌లో జాయిన్ అయ్యాడు. కానీ, మరో ముగ్గిరిని ఈ స్కీమ్‌లో జాయిన్ చేస్తేనే అతడికి ఎలక్ట్రిక్ బైకు ఇస్తారని చెప్పడంతో అతడు మరో ముగ్గిరిని జాయిన్ చేయించలేక తన డబ్బులు తిరిగి పొందలేక మోసపోయాడు. నరేశ్‌కుమార్ ఫిర్యాదు మేరకు వేములవాడ టౌన్ పోలీసులు రేగుల బలరాం, ఎస్ఎస్ఎకో మోటార్స్ యాజమాన్యంపై కేసు నమోదు చేసి బలరాంను రిమాండ్‌కు తరలించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎస్పీ పేర్కొన్నారు. ఇంకా ఎవరైనా ఎస్ఎస్ఎకో మోటార్స్ యాజమాన్యం ద్వారా మోసపోయినవారు ఉంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు.



హెల్మెట్ ముద్దు.. డ్రంకెన్ డ్రైవ్ వద్దు

సిరిసిల్లటౌన్: రోడ్డు ప్రమాదాలు అరికట్టడంలో ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని సిరిసిల్ల ట్రాఫిక్ ఎస్సై రమేశ్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల అంబేడ్కర్ చౌరస్తాలో ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని విద్యార్థుల ఆటపాటలతో ప్రదర్శనతో అలరించారు.

కొత్త ఆశలు.. కొత్త బాసలు

- ఈ ఏడాదిలో ఏం చేస్తామంటే...
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్, ఎస్పీ అభిప్రాయాలు

సిరిసిల్ల: కాలం కరిగిపోతుంది.. కాలగతిలో మరో సంవత్సరం కలిసిపోయింది. గతం మరుపురాని అనుభూతినిస్తుంది.. వర్తమానం కోటి ఆశలు చిగురిస్తాయి. కొత్త ఏడాది.. కొత్త ఆలోచనలు.. సరికొత్త ప్రణాళికలు.. కొత్త ఆశలు.. ఇలా గతానికి భిన్నంగా కొంతలో కొంతైనా.. మంచిని మార్పును ఆశిద్దాం.. కొత్త ఏడాదిలో కొత్తగా ఏం చేస్తారని జిల్లాకు చెందిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్‌లను మంగళవారం సాయంత్రం 'సాక్షి' పలకరించగా.. వారు చెప్పిన విశేషాలు.. వారి మాటల్లోనే...

రైతులు.. నేతన్నల సమస్యలు పరిష్కారం



కొత్త ఏడాదిలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో భాగంగా వివిధ దశల్లో ఉన్న పనులు పూర్తి చేయించి జిల్లాలోని రైతాంగానికి సాగునీరు అందిస్తాం. మల్కపల్లి ప్రాజెక్టు, కలికోట సూరమ్మ చెరువు, లచ్చపేట తండా రిజర్వాయర్, మల్కపేట రిజర్వాయర్ పనులు, కాల్వల నిర్మాణ పనులు, భూసేకరణ పనులు పూర్తి చేసి లక్ష ఎకరాలకు సాగునీరు అందేలా పనులు చేస్తా. వేములవాడ ఆలయ అభివృద్ధి పనులు, రోడ్లు విస్తరణ, అన్నసత్రం పనులు పూర్తి చేయిస్తాం. చందుర్తి–మోత్కురావుపేట రోడ్డు నిర్మాణం పూర్తి చేయిస్తా. సిరిసిల్ల నేతన్నలకు ప్రభుత్వ చీరల ఆర్డర్లు ఇస్తాం. ఇప్పటికే నూలు డిపో ఏర్పాటు చేశాం. నేతన్నల ఉపాధికి భరోసా కల్పిస్తాం. సిరిసిల్ల నియోజకవర్గ పరిధిలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. అర్హత కలిగిన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తాం. పారదర్శకంగా ప్రజాపాలనను అందిస్తాం.
– ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే

పారదర్శకంగా ప్రభుత్వ పథకాల అమలు



ప్రభుత్వం అమలు చేసే పథకాలను సమర్థవంతంగా, పారదర్శకంగా అమలు చేస్తాం. పాలనలో ఎక్కడా తప్పిదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రాధాన్యత రంగాలపై ఫోకస్‌తో పనిచేస్తాం. ప్రభుత్వం అమలు చేసే ఇందిరమ్మ ఇళ్ల పథకం ఇతర అన్ని పథకాలను అర్హులకు అందించేలా పారదర్శకంగా పని చేస్తాం. వైద్య, విద్యా రంగంలో మరింత ప్రగతి సాధించే దిశగా ముందుకు సాగుతాం.
– సందీప్‌కుమార్ ఝా, కలెక్టర్

సమర్థవంతంగా పని చేస్తాం




ప్రజాక్షేత్రంలో నిరంతరం సమర్థవంతంగా పని చేస్తాం. ప్రజలు నూతన సంవత్సరం వేడుకలు ఇళ్లలో ఉండి నిర్వహించుకోవాలి. రోడ్లపైకి వచ్చి డీజేలు పెడితే చట్టపరంగా శిక్షిస్తాం. సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతో పాటు, జిల్లా వ్యాప్తంగా 500 మంది పోలీసులతో నిఘా ఉంచి శాంతిభద్రతల పరిరక్షణకు పని చేస్తాం. గంజాయి రహిత జిల్లాగా మార్చుతాం. జిల్లాలో గంజాయి రవాణా, నిల్వలు, విక్రయాలపై నిఘా ఉంచి కట్టడి చేస్తాం. గంజాయి కట్టడికి యూరిన్ పరీక్షలు చేస్తాం. మరోవైపు సైబర్ నేరాలు సవాల్‌గా మారాయి. వీటిని కట్టడి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం. ప్రజల్లో దీనిపై చైతన్యం తెచ్చి సైబర్ నేరాలను అరికడుతాం. విజిబుల్ పోలీసింగ్‌కి ప్రాధాన్యతనిస్తూ, శాంతిభద్రత పరిరక్షణలో ముందుంటాం. ప్రజలకు పోలీసులు మరింత చేరువయ్యేలా చూస్తాం. నేరాల నియంత్రణకు టెక్నాలజీని వినియోగించుకుంటాం. జిలా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.
– అఖిల్ మహాజన్, ఎస్పీ

కొండగట్టు అభివృద్ధికి కృషి



చొప్పదండి: చొప్పదండి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిచేసి రాష్ట్రంలోనే ముందు వరుసలో నిలుపుతా. ముఖ్యంగా నియోజకవర్గ ప్రజలకు ఇలవేల్పు అయిన కొండగట్టు దేవస్థానంలో అభివృద్ధి చర్యలు చేపడతాను. భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయిస్తాను. చొప్పదండి పరిధిలో రోడ్లు, సాగునీరు తదితర రంగాలలో మెరుగైన ప్రగతి సాధిస్తాం. ప్రజలకు అందుబాటులో ఉంటూ.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.
– మేడిపల్లి సత్యం, చొప్పదండి ఎమ్మెల్యే

విద్య, వైద్యానికి ప్రాధాన్యం



మానకొండూర్: మానకొండూర్ నియోజకవర్గంలో విద్యా, వైద్యానికి మొదటి ప్రాధాన్యం ఇస్తాను. ప్రజల అవసరాలు తీర్చడంలో ముందుంటాను. మానకొండూర్, ఇల్లంతకుంట మండలకేంద్రాల్లో 50 పడకల ఆస్పత్రుల నిర్మాణానికి త్వరలోనే టెండర్లు ప్రకటిస్తున్నాము. మండలంలోని నూతనంగా రోడ్లు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయిస్తున్నాను. పేదలకు అండగా ఉంటూ.. కాంగ్రెస్ సర్కారు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో అమలు అయ్యేలా కృషి చేస్తాను. కార్యకర్తలు, ప్రజలకు అన్ని వేళల్లో అందుబాటులో ఉంటాను.
– కవ్వంపల్లి సత్యనారాయణ, మానకొండూర్ ఎమ్మెల్యే

జిల్లా పోలీసులకు పతకాలు

- అదనపు ఎస్పీకి మహోన్నత సేవా పతకం
- మరో ఐదుగురికి సేవా పతకాలు
- అభినందించిన ఎస్పీ అఖిల్ మహాజన్



ఏఎస్పీ చంద్రయ్య



యాదగిరి, ఆర్ఐ



సత్యనారాయణ, ఏఆర్ఎస్ఐ

సిరిసిల్లకల్చరల్: శాంతి భద్రతల పర్యవేక్షణలో విధులు నిర్వహించిన పలువురు జిల్లా పోలీస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం పతకాల బహూకరణకు ఎంపిక చేసింది. ప్రతిష్టాత్మక మహోన్నత సేవా పతకానికి అదనపు ఎస్పీ చంద్రయ్య (అడ్మిన్) ఎంపికవడం విశేషం కాగా... ఆయనతో పాటు మరో ఐదుగురు పోలీస్ ఆఫీసర్లకు ఉత్తమ సేవా పతకాల స్వీకరణకు అర్హత సాధించారు. జిల్లా రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎల్.యాదగిరి, ఏఆర్ఎస్ఐ సత్యనారాయణ, బోయిన్‌పల్లి హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబల్ సాయి మహేశ్‌లు ప్రతిష్టాత్మక పోలీస్ పతకాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, చిత్తశుద్ధితో విధులు నిర్వహించిన అధికారుల శ్రమకు ప్రతిఫలాలే ఈ పతకాలు అని, పతకాల స్వీకరణకు అర్హత సాధించిన పోలీస్ అధికారులను అభినందించారు.

క్లుప్తంగా

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


బాధిత కుటుంబానికి బియ్యం అందజేస్తున్న ఆర్ఐ సంతోష్

వీర్నపల్లి: మండలంలోని బంజేరు గ్రామంలో సోమవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో కత్తరపాక రాజయ్య ఇల్లు దగ్ధమైంది. స్థానికులు ఫైరింజన్‌కు సమాచారమివ్వగా సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ఇంట్లో సామగ్రి, బీరువా, బట్టలు, విలువైన వస్తువులు కాలిపోయాయి. దాదాపు రూ.3 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. ఆర్ఐ సంతోష్, ఎస్సై ఎల్లయ్య గౌడ్ ఘటన స్థలానికి చేరుకొని రాజయ్య కుటుంబానికి తక్షణ సాయం కింద 25 కేజీల బియ్యం అందజేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

జమ్మికుంట: అలయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సంయుక్తంగా నిరుద్యోగ యువతకు నిర్వహించే ఉచిత నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అలయ ఫౌండేషన్ స్టేట్ కో–ఆర్డినేటర్ గాదె గుణసాగర్ సూచించారు. డ్రైవాల్, పాల్స్ సీలింగ్ టెక్నీషియన్, వెల్డింగ్, ఫ్రాబికేషన్ టెక్నీషియన్, ఆటో మొబైల్స్, టూ వీలర్, ఫీల్డ్ టెక్నీషియన్, ఎయిర్‌కండిషన్ అసిస్టెంట్, ఎలక్ట్రీషియన్, ఎక్స్‌కవేటర్ ఆపరేటర్, ఆఫీస్ పరేషన్ ఎగ్జిక్యూటివ్ వంటి కోర్సుల్లో శిక్షణ పొందవచ్చాన్నారు. వయస్సు 18 నుంచి 35ఏళ్ల మధ్య ఉండాలన్నారు. రెండు నెలల శిక్షణ, నెల ఆన్‌టైం జాబ్, పరిశ్రమ భాగస్వామ్యంతో శిక్షణ, కోర్సు సర్టిఫికెట్ అందిస్తామని అన్నారు. విద్యార్హతలు 8వ తరగతి నుంచి డిగ్రీవరకు చదువుకున్నవారు అర్హులని తెలిపారు. శిక్షణకాలంలో ఉచితవసతి, భోజనం ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ కోసం 5 జనవరి 2025వరకు వాట్సాప్ నంబర్లు 9949446802, 9885981959, 9177413107ను సంప్రదించాలని పేర్కొన్నారు.

మాంజా దారం.. మస్తు ప్రమాదం

- నిషేధిత వస్తువుల విక్రయాలపై నిర్లక్ష్యం
- తనిఖీలు లేక యథేచ్ఛగా విక్రయం
- ప్రాణాంతకంగా మారుతున్న మాంజా దారం

'కొత్త సంవత్సరం. సరదాగా సాగిపోతుందనుకున్న ఓ ఆదివారం సెలవు రోజున గాలి పటాన్ని ఎగరేద్దామనుకున్న ఓ స్కూల్ పిల్లాడు మాంజా కారణంగా గాయాల పాలయ్యాడు. నిషేధిత మాంజా దారం కాలికి చుట్టుకుని కాలి చీలమండ దగ్గర లిగ్మెంట్ పూర్తిగా తెగిపోయింది. హుటాహుటిన ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తే ప్రాణాపాయం తప్పిన ఈ ఘటన జిల్లా కేంద్రంలోని అంబికానగర్‌లో ఏడాది క్రితం జరిగింది'.

సిరిసిల్లకల్చరల్: సంక్రాంతి పండుగ సెలవుల్లో గాలి పటాలు ఎగరేసేందుకు ఉపయోగించే దారం చిన్నారుల ఉసురు తీస్తోంది. నిషేధిత మాంజాను ఉపయోగించడం వల్ల తెలియకుండానే పిల్లలు ప్రాణాల మీదకి తెచ్చుకుంటున్నారు. మాంజా దారం నైలాన్‌తో తయారవుతుంది. దీనికి గాజు పొడిని పూతగా పూస్తే మాంజాగా మారుతుంది. పోటీగా ఎగురుతున్న గాలి పటాన్ని పడగొట్టేందుకు మాంజా బాగా పనికొస్తుంది. దీంతో పిల్లలు మాంజా వినియోగానికి ఆసక్తి చూపుతున్నారు.

ఆంక్షలు అమలులో ఉన్నా..

చైనా తయారు చేస్తున్న మాంజా దారం మార్కెట్‌లో లభ్యమవుతోంది. ప్రభుత్వం నిషేధం విధించినా చట్ట వ్యతిరేకంగా విక్రయాలు జరుగుతూనే ఉన్నాయి. గాలి పటాలు ఎగరేయడం వల్ల పొడవైన


మాంజా దారం

చెట్లు, కరంట్ స్తంభాలకు దారం చుట్టుకుంటోంది. వీటిపై పక్షులు వాలే సమయంలో అవి మృత్యువాత పడుతున్నాయి.

చట్టం ఏం చెప్తోందంటే..

- పర్యావరణ పరిరక్షణ చట్టం 1986లోని 15సెక్షన్ ప్రకారం నిషేధిత వస్తువులతో ప్రకృతికి నష్టం కలిగించే నేరానికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. నేరాల తీవ్రత, స్థాయి ఆధారంగా భారతీయ న్యాయ సంహిత 223 ఏ ప్రకారం ఆరు నెలల జైలు, రూ.2,500 జరిమానా, సెక్షన్ 223 బీ ప్రకారం ఏడాది జైలు, రూ.5వేల జరిమానా, సెక్షన్ 106 (1) ప్రకారం ఐదేళ్ల జైలు, 125 (ఏ) ప్రకారం ఆరు నెలల ఖైదు, రూ. 5వేల ఫైన్, 125 (బి) ప్రకారం మూడేళ్ల జైలు రూ. 10వేల జరిమానా విధిస్తారు.
- నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ 2016లో చైనా మాంజా తయారీ, నిలువ, అమ్మకాలు, వినియోగాన్ని పూర్తిగా నిషేధించింది. విరుద్ధంగా వ్యవహరించే వారికి కఠిన శిక్షలు విధించాలని చట్టాన్ని రూపొందించింది.
- పర్యావరణ పరిరక్షణ చట్టం 1986లోని సెక్షన్ 5 ప్రకారం నైలాన్ దారంపై ప్రభుత్వం నిషేధం విధించింది.
- గాజు లేదా ఇతర సింథటిక్ (నాన్ బయో డిగ్రేడబుల్) దారాలను పండుగలు, ఇతర సందర్భాల్లో ఉపయోగించడాన్ని నేరంగా పరిగణించింది. నైలాన్ దారంతో తయారు చేసిన మాంజా కారణంగా పక్షులు, రాబందులు, గుడ్లగూబలు, పావురాలు, కాకుల ప్రాణాలకు ముప్పు కలుగుతోంది. దీంతో కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖలు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను అప్రమత్తం చేశాయి.

గతంలో జరిగిన దుర్ఘటనలు

- మూడేళ్ల క్రితం చంద్రంపేటలో మాంజా దారం ఓ చిన్నారి గొంతును తెగ్గోసింది. తడగొండ రామకృష్ణ, స్వప్న దంపతులు కొడుకు సాన్విత్‌తో కలిసి బీవైనగర్‌లోని పుట్టింటికి వచ్చారు. తిరిగి వెళ్లే సమయంలో టీవీఎస్ ఛాంప్‌పై నిలుచుని ఉన్న సాన్విత్ మెడకు అనూహ్యంగా మాంజా దారం చుట్టుకుని కోసింది. తీవ్ర రక్త స్రావం జరిగిన పరిస్థితుల్లో ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తే ప్రాణాపాయం తప్పింది.
- రెండేళ్ల క్రితం మంచిర్యాలలో ఇద్దరు భార్యాభర్తలు కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మాంజా దారం బండి నడుపుతున్న భర్త మెడకు చుట్టుకోవడంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు.
- గతంలో జిల్లా కేంద్రంలోని అంబికానగర్‌కు చెందిన కుందెన వంశీ అనే పిల్లవాడి కాలి లిగ్మెంట్ తెగిపోయింది.

నిషేధిత మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత, అధికారులు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత

సిరిసిల్లకల్చరల్: పతంగులు ఎగరేసేందుకు వాడుతున్న చైనా మాంజాపై ప్రభుత్వం నిషేధం విధించినప్పటికీ చట్ట వ్యతిరేకంగా అమ్ముతున్న వ్యాపారులపై ఇకపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత పేర్కొన్నారు. మంగళవారం కోర్టు ప్రాంగణంలో సంబంధిత పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. మాంజా వినియోగం వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన లేని ప్రజలు, విద్యార్థులు కొనుగోళ్లు చేసి ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. పక్షులు, వన్య ప్రాణుల ఉనికికి ప్రమాదం కలిగిస్తున్న మాంజా సమాజంలో పలు ప్రమాదాలకు కారణమైందని ఉదహరించారు. మాంజా వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విస్తృత ప్రచారం కలిగించేందుకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రత్యేక పోస్టర్ రూపొందించడంపై అభినందించారు. మాంజా విక్రయదారుల సమాచారాన్ని పోలీసులకు అందించాలని పౌర సమాజాన్ని కోరారు. విద్యార్థులకు మాంజా అనర్థాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించి అవగాహన పెంచాలని జిల్లా విద్యాధికారికి సూచించారు. ఇకపై నిషేధిత మాంజా విక్రయించిన వ్యాపారులకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రాధి కాజైస్వాల్, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్, సీఐ కృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దోర్నాల సంజీవ్‌రెడ్డి, తంగళ్లపల్లి వెంకటి, డీఎల్ఎస్ఏ ప్రతినిధులు ఆడెపు వేణు, మల్లేశ్, జ్యోతి, మున్సిపల్ కమిషనర్ లావణ్య దుబ్బాక, డీఈవో జగన్మోహన్‌రెడ్డి, లోక్ అదాలత్ సభ్యుడు చింతోజు భాస్కర్ పలువురు న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదమా.. పనిగట్టుకుని చేసిందా..

- పోలీసులకు పట్టుబడిన ఇసుక ట్రాక్టర్
- స్టేషన్‌కు తరలిస్తుండగా మానేరు కెనాల్‌పై బోల్తా
- హోంగార్డుకు గాయాలు

ముస్తాబాద్(సిరిసిల్ల): రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలో ఇసుక స్మగ్లర్లు మరోసారి రెచ్చిపోయారు. ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతుందనడానికి నిదర్శనంగా ముస్తాబాద్–పోతుగల్ గ్రామాల మధ్య మానేరు కెనాల్‌పై మంగళవారం ఓ ఇసుక ట్రాక్టర్ బోల్తాపడిన ఘటన రుజువుగా నిలుస్తుంది. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాలు.. పోతుగల్ నక్కవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. హోంగార్డు వెంకట్ ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తుండగా మానేరు కెనాల్‌పై బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్‌పై ఉన్న హోంగార్డు కింద పడిపోగా గాయాలపాలయ్యాడు. డ్రైవర్ గోపి త్రుటిలో తప్పించుకున్నాడు. అయితే ట్రాక్టర్‌ను డ్రైవర్ కావాలనే బోల్తా కొట్టించారా లేదా ప్రమాదవశాత్తు బోల్తాపడిందా అనే విషయంపై పోలీసులు విచారణ చేస్తున్నారు. గతంలో నామాపూర్‌లో పోలీసులకు పట్టుబడిన ఇసుక ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలిస్తుండగా డ్రైవర్ చెరువులోకి తీసుకెళ్లిన ఘటనలో కానిస్టేబుల్ సత్యనారాయణ తీవ్రగాయాలకు గురై.. అచేతన స్థితిలో ఉన్న సంగతి విదితమే. అలాంటి ఘటనే ప్రస్తుతం కూడా జరిగి ఉంటుందనే చర్చ జరుగుతోంది. మానేరు కెనాల్‌పై దారి ఎత్తు వంపులు ఉండడం వల్ల కూడా ట్రాక్టర్ బోల్తా పడి ఉండవచ్చని ఎస్సై తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రైవర్‌తోపాటు యజమానిపై కేసు నమోదు చేశారు.


బోల్తాపడిన ఇసుక ట్రాక్టర్

చిన్నారిపై కుక్కల దాడి

- అదుపుతప్పిన వాహనదారులు
- ఇద్దరికి తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మంగళవారం రాత్రి కుక్కలు స్వైరవిహారం చేశాయి. కుక్కలు ద్విచక్రవాహనాన్ని వెంబడించడంతో వాటిని తప్పించుకునే ప్రయత్నంలో ఇద్దరు వాహనదారులు అదుపుతప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. మరో ఘటనలో కుక్కల దాడిలో చిన్నారి గాయపడింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని కిష్టంపల్లి రోడ్డులో బండలింగంపల్లికి చెందిన రాజేశ్, ఇలియాస్ బైక్‌పై వెళ్తుండగా కుక్కలు వెంబడించాయి. వాటిని తప్పించుకునేందుకు వేగంగా వెళ్లడంతో బైక్ అదుపుతప్పి ఇద్దరు కిందపడ్డారు.


కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి


ప్రమాదంలో గాయపడిన రాజేశ్

ఈ ప్రమాదంలో రాజేశ్ తలకు, కాళ్లకు తీవ్ర గాయాలు కాగా.. ఇలియాస్ స్వల్పంగా గాయపడ్డారు. ఇద్దరిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అలాగే మరో సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన మంగాపురం కవిత–ఎల్లం దంపతుల కూతురు నాలుగేళ్ల నిహారికపై కుక్కల గుంపు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. చెవికి అయిన గాయం నుంచి తీవ్ర రక్తస్రావం కావడంతో తల్లిదండ్రులు వెంటనే చిన్నారిని సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం చిన్నారి క్షేమంగా ఉంది.

'మీకోసం జైల్లో న్యూఇయర్ సెలబ్రేషన్స్ రెడీ'

శంకరపట్నం(మానకొండూర్): 2024 సంవత్సరానికి గుడ్‌బై చెప్పి 2025 సంవత్సరానికి స్వాగతం చెప్పేందుకు మద్యం తాగి వాహనాలు నడిపేవారు, రోడ్లపై స్టంట్లు, న్యూసెన్స్ చేసేవారి కోసం మీకోసం జైల్లో న్యూఇయర్ సెలబ్రేషన్ రెడీ పేరిట శంకరపట్నం మండలంలో సామాజిక మాధ్యమంలో కేశవపట్నం ఎస్సై రవి వినూత్న రీతిలో పోస్టులు పెట్టి యువతను ఆలోచనలో పడేశారు. డ్రగ్స్ సేవించే వ్యక్తుల కోసం తెలంగాణ పోలీసులు బేడీలతో రెడీగా ఉన్నారని, సహాయం కోసం డయల్ 100ను సంప్రదించాలని పోలీసులు ముద్రించిన రాతలు వైరలయ్యాయి.



మాధ్యమాల్లో వైరల్ అయిన పోస్ట్

భవనం పై నుంచి పడి వృద్ధుడి మృతి

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని గణేశ్‌నగర్‌లో నివాసముంటున్న బండారి నర్సయ్య (70) ఇంటిపై నుంచి పడి మృతిచెందాడు. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం దేవపూర్‌కు చెందిన బండారి సత్యనారాయణ వ్యాపారం నిమిత్తం గణేశ్‌నగర్‌లో నివసిస్తున్నాడు. ఆయన తండ్రి నర్సయ్య కొద్దిరోజుల క్రితం ఇక్కడకు వచ్చాడు. సోమవారం రాత్రి సమయంలో ఇంటిపైకి వెళ్లేందుకు మెట్లు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. ఆయనను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై గీత తెలిపారు.

అనుమానమే పెనుభూతమై..

- భార్య మేనమామపై హత్యాయత్నం
- చూస్తుండగానే తల్వార్‌తో దాడి
- ప్రాణాపాయ స్థితిలో బాధితుడు శ్రీనివాస్



బాధితుడు శ్రీనివాస్

గోదావరిఖని: మాట్లాడే పనుందని పిలిచి భార్య మేనమామపై తల్వార్‌తో దాడిచేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన కోల్‌బెల్ట్ ప్రాంతంలో మంగళవారం సంచలనం సృష్టించింది. స్థానిక వినోభానగర్‌కు చెందిన నంది శ్రీనివాస్‌ను మంచిర్యాల జిల్లా భీమారం మండల కేంద్రానికి చెందిన గొల్ల శ్రావణ్ కాలేజీ గ్రౌండ్‌లో వందలాది మంది విద్యార్థులు చూస్తుండగానే తల్వార్‌తో విచక్షణ రహితంగా దాడచేశాడు. తీవ్రగాయాలపాలైన నంది శ్రీనివాస్ చావుబతుకుల మధ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గోదావరిఖని ఏసీపీ రమేశ్ కథనం ప్రకారం.. భీమారం ప్రాంతానికి చెందిన గొల్ల శ్రావణ్ వినోభానగర్‌కు చెందిన నంది శ్రీనివాస్ మేనకోడలు కాళ్ల పూజను ఆరేళ్లక్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్రావణ్‌కు ఇతర మహిళతో వివాహేతర సంబంధం ఉందనే కారణంతో భార్యాభర్తల మధ్య ఏడాదిగా గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో పూజ మేనమామ జోక్యం చేసుకుని ఎందుకు కొడుతున్నావని భీమారం వెళ్లి అతడి తల్లిదండ్రులతో మాట్లాడి పద్ధతి మార్చుకోవాలని చెప్పి వచ్చాడు. తన ప్రవర్తన మార్చుకోకుండా గొల్ల శ్రావణ్ తనభార్య పూజను మళ్లీ కొట్టడంతో నంది శ్రీనివాస్, నంది నగేశ్, కాళ్ల కిరణ్ భీమారం వెళ్లి పూజను ఇంటికి తీసుకువచ్చారు. దీంతో పగపెంచుకుని శ్రావణ్ మంగళవారం గోదావరిఖనికి బైక్‌పై చేరుకున్నాడు. ఎలక్ట్రికల్ షాపులో పనిచేస్తున్న నంది శ్రీనివాస్‌ను బైక్‌పై ఎక్కించుకుని స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్‌కు తీసుకువచ్చాడు. అప్పటికే వెంట తెచ్చుకున్న తల్వార్‌తో నంది శ్రీనివాస్‌పై విచక్షణ రహితంగా దాడి చేశాడు. రామగుండం సీపీ శ్రీనివాస్, డీసీపీ చేతన ఆదేశాల మేరకు వెంటనే రంగంలో దిగిన వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేసి నిందితుడు గొల్ల శ్రవణ్‌ను పట్టుకుని అరెస్ట్ చేశారు. తాను చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడానికి భార్యపై తప్పుడు ఆరోపణలు చేసి, అనుమానిస్తూ ఈఅఘాయిత్యానికి దిగినట్లు ఏసీపీ వెల్లడించారు. కాగా బాధితుడిని చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉంది. సమావేశంలో సీఐలు ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నిందితుడు గొల్ల శ్రావణ్ అరెస్ట్ చూపిస్తున్న ఏసీపీ రమేశ్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మేడిపల్లి: భీమారం మండల కేంద్రంలో మంగళవారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే చనిపోయాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీస్‌ల కథనం ప్రకారం భీమారానికి చెందిన ఆకునూరి బూమరాజం, అదే గ్రామానికి చెందిన బాలుడు ద్విచక్రవాహనాలపై వస్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ఘటనలో బూమరాజం(42) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు జగిత్యాల ఆసుపత్రికి తరలిస్తుండగానే చనిపోయాడు. తీవ్రంగా గాయపడిన బాలుడికి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఐదుగురిపై కేసు

ధర్మపురి: డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాంనర్సింహారెడ్డి తెలిపారు. పట్టణంలో మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడిపిస్తున్న యువకులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్సై ఉదయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.











